క్లుప్తంగా

ఆత్మగౌరవానికి ప్రతీక మహాశిల్పం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



అవనిగడ్డ: ఆత్మగౌరవానికి ప్రతీక అంబేడ్కర్ మహాశిల్పమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. విజయవాడ నడిబొడ్డున బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశం గర్వించదగేలా అంబేడ్కర్ మహాశిల్పాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసి చరిత్ర సృష్టించారని చెప్పారు. యావత్ దళితులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తరతరాలు గుర్తించుకునేలా మహాఘట్టం జరిగిందన్నారు. విగ్రహ ఆవిష్కరణకు లక్షలాది మంది ప్రజలు తరలి రావడంతో దిక్కుతోచని ప్రతిపక్ష పార్టీలు చౌకబారు విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

కార్తికేయుని సన్నిధిలో ఐపీఎస్ మల్లారెడ్డి



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, ఐపీఎస్ బి.మల్లారెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్ శర్మ, ఫణికుమార్ శర్మ స్వామివారికి అభిషేకం చేశారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



కృత్తివెన్ను: ప్రభుత్వ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో వక్తలు అన్నారు. మండల పరిధిలోని యండపల్లి సచివాలయం వద్ద శనివారం కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పథకాలు, వాటి ప్రయోజనాలను సంకల్పయాత్ర ప్రచార రథం జిల్లా కోఆర్డినేటర్ శ్రీరామచంద్రమూర్తి వివరించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిన్నెంటి ప్రభుప్రసాద్, పీసీసీ మాజీ సభ్యుడు పిన్నెంటి బాబ్జీ, బీజేపీ జిల్లా కార్యదర్శి పుప్పాల రాము, బీజేపీ నేతలు దాసరి శ్రీను, బండ్రెడ్డి ఆంజనేయులు, పాశం శ్రీను, పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరి, సచివాలయ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

23న కేవీలో పెయింటింగ్ పోటీలు

మచిలీపట్నంటౌన్: స్థానిక కేంద్రీయ విద్యాలయంలో ఈ నెల 23వ తేదీ మంగళవారం 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. చంద్రయాన్, స్పోర్టింగ్ సక్సెస్ ఆఫ్ ఇండియా, వికసిత్ భారత్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఆదిత్య ఎల్–1 తదితర అంశాలపై పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు క్రయాన్సు, రంగులు, ఆర్ట్ పేపర్లు తదితర వస్తువులను అందిస్తారని పేర్కొన్నారు. పోటీల్లో ఐదుగురిని ఉత్తమ విద్యార్థులుగా ఎంపిక చేస్తారని వివరించారు. మచిలీపట్నం ప్రాంతంలోని అన్ని రకాల విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు.

లయన్స్ సేవలు అభినందనీయం

చల్లపల్లి: లయన్స్ క్లబ్ సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు తెలిపారు. స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కే నగర్ ఆధ్వర్యాన వంశీ హార్ట్ కేర్ సెంటర్ అండ్ హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటరు వారితో ఉచిత మెగా వైద్య శిబిరం, మాలెంపాటి రంగారావు సహకారంతో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. శిబిరంలో కార్డియాలజీ, ఎల్రక్ట్రోఫిజియాలజీ, ఆంకాలజీ, ఆప్తమాలజీ వైద్యులు రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు మోపిదేవి వెంకటేశ్వరరావు, కార్యదర్శి రాయపాటి రాధాకృష్ణ, క్లబ్ ప్రతినిధులు నర్రా సాయి, ముమ్మనేని నాని, తగిరిశ సాంబశివరావు, హరిగోపాల్ పర్యవేక్షించారు.

పల్లెలకు స్వచ్ఛమైన తాగునీరు

- జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము
- గూడూరులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వేదికపై రాము

గూడూరు: గ్రామాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి కృషి చేస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ 'పెడన' ఇన్‌చార్జి ఉప్పాల రాము చెప్పారు. గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో హారిక, రాము మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య ఎదురు కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముక్కొల్లు సీపీడబ్ల్యూడీ స్కీం ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి శుభ్రత విషయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, యుద్ధప్రాతిపదికన కార్యాచరణ రూపొందించాలని ఆయన కోరారు. ప్రతి గ్రామంలో మైక్రోఫిల్టర్ల ద్వారా తాగునీరు అందించడానికి అవసరమైన ప్రణాళికలు రెండు రోజుల్లో సిద్ధం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఫిబ్రవరి నెలాఖరులోపు ప్రతి గ్రామంలో పనులు పూర్తి చేసి పరిశుద్ధ శుద్ధ జలాలు అందించాలన్న లక్ష్యంతో అధికారులు పని చేయాలన్నారు. చెరువులను నింపడానికి ప్రభుత్వం కాలువల్లో నీటి విడుదలకు సన్నాహాలు చేస్తుందని, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు సమన్వయం చేసుకోవాలని కోరారు. కోర్టు వివాదాల కారణంగా గూడూరు, ఐదుగుళ్లపల్లి, చిట్టిగూడూరు, రామరాజుపాలెం, ఆకులమన్నాడు గ్రామాల్లో ఇళ్ల స్థలాల పంపిణీ విషయంలో ఏర్పడిన అవరోధాలను అధిగమించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బి.విజయప్రసాద్‌ను కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెడన నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారని, తనకు అప్పగించిన బాధ్యతతో కచ్చితమైన మార్పును తీసుకురావడానికి కృషి చేస్తానని రాము చెప్పారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు నేతల కుటుంబరావు, పిచ్చుక గంగాధరరావు, ఏపీఎస్‌ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, గొరిపర్తి రవికుమార్, ఎంపీడీఓ డి.సుబ్బారావు, తహసీల్దార్ బి.విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి పంచాయతీకి అందిన పాతబకాయి

- ఎస్పీ జాషువా చొరవ
- గ్రామ పంచాయతీకి రూ.5.25 లక్షలు జమ



చల్లపల్లి పోలీస్ క్వార్టర్స్

చల్లపల్లి: కృష్ణా జిల్లా ఎస్పీ పి.జాషువా చొరవతో చల్లపల్లి గ్రామ పంచాయతీకి పాత బకాయి తీరింది. చల్లపల్లిలోని పోలీస్‌స్టేషన్, పోలీస్ క్వార్టర్స్, ఎస్‌ఐ క్వార్టర్ల ఇంటి పన్ను, కుళాయి ఫీజులు 1997–98 ఆర్థిక సంవత్సరం నుంచి 2022–23 వరకు బకాయిలు పేరుకుపోయాయి. ఎస్పీ చొరవతో రూ.5,25,765 గ్రామ పంచాయతీ ఖాతాకు జమయ్యాయి. పాతికేళ్ల బకాయిలు ఒకేసారి చెల్లించడానికి కృషి చేసిన ఎస్పీ పి.జాషువాకు, అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్‌కు, చల్లపల్లి సీఐ సీహెచ్.నాగప్రసాద్‌కు, ఎస్‌ఐ సీహెచ్.చినబాబుకు సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, పాలకవర్గ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

నవోదయ పాఠశాలల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో నవోదయ పాఠశాలల ప్రవేశం కోసం శనివారం పరీక్ష నిర్వహించినట్లు డీఈవో తాహెరాసుల్తానా తెలిపారు. ఈ పరీక్షను జిల్లాలో ఏర్పాటు చేసిన 22 కేంద్రాల్లో నిర్వహించామన్నారు. దీనిదీనికి 4,407 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆమె తెలిపారు. పరీక్షలో అర్హులైన వారికి నవోదయ పాఠశాలల్లో ప్రవేశం దొరుకుతుందన్నారు.

రేపు అన్నసంతర్పణ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు

భావదేవరపల్లి(నాగాయలంక): భావదేవరపల్లిలో భోగాదివారి ముఠా పూర్వీకుల రామాలయంలో సోమవారం భారీ అన్నసంతర్పణ, భజనలు, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త భోగాది గిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయోధ్యలో సోమవారం బాలరాముని ప్రాణప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా రెండు వేల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేస్తామని పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ భజన మండళ్ల ఆధ్వర్యాన ప్రత్యేకంగా సీత, రామ, హనుమత్ భజనలు జరుగుతాయని వివరించారు.

భక్తులకు కొంగుబంగారం



విద్యుత్‌దీపాల వెలుగులో అమ్మవారి ఆలయం



పూజలందుకున్న ఆదివనవలమ్మ



ఊరేగింపులో భేతాళ నృత్య ప్రదర్శన

నేడు ఆదివనవలమ్మదేవి జాతర

మచిలీపట్నంటౌన్: కోరిన కోర్కెలు తీర్చే కొంగ బంగారం.. ఆదివనవలమ్మదేవి. అమ్మవారి 107 జాతర మహోత్సవం ఆదివారం జరగనుంది. దీనికి ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. నగరంలోని బైపాస్ రోడ్డులో కృష్ణవేణి ఐటీఐ కళాశాల సమీపంలోని ఆలయంలో అమ్మవారు కొలువుదీరారు. ఏటా సంక్రాంతి తరువాత వచ్చే ఆదివారం అమ్మవారి జాతరను నిర్వహించడం ఆనవాయితీ. అమ్మవారి గ్రామోత్సవం ఈ నెల 19వ తేదీ శుక్రవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. శనివారం అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. సాయంత్రం పరదేవత అమ్మవారి రూపకల్పనలో ఆలయం వద్ద భేతాళ నృత్య విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం భక్తులు అమ్మవారికి కోళ్లు, మేకలు, గొర్రెలు సమర్పించి మొక్కులు తీర్చుకోనున్నారు. 22వ తేదీ సోమవారం అమ్మవారికి వెండిచీర అలంకరించి పూజలు చేస్తారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరగనుంది. జాతర సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకుడు నూతి వన వెంకట సత్యనారాయణ (రమణ) పర్యవేక్షిస్తున్నారు.

రేపు శ్రీరామ శోభాయాత్ర

చల్లపల్లి: అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 22న చల్లపల్లిలో శ్రీరామ శోభాయాత్ర ఏర్పాటు చేసినట్లు ఆర్యవైశ్య సంఘ నాయకులు వరదా హరిగోపాల్ తెలిపారు. శనివారం స్థానిక సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 9.30 గంటలకు సీతారామ లక్ష్మణ హనుమ విగ్రహాలకు పల్లకీ సేవతో శోభాయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. సంఘ భవనం నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు శోభాయాత్ర, హనుమాన్‌చాలీసా, సుందరకాండ తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సమావేశంలో సంఘ నాయకులు గోళ్ల ద్రోణ పూర్ణచంద్రరావు, కొల్లిపర మధు, జల్లూరి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయాల్లో స్వచ్ఛతీర్థ్

కృత్తివెన్ను: అయోధ్య రామాలయంలో శ్రీ బాలరాముని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం పురస్కరించుకుని స్వచ్ఛతీర్థ్ పేరుతో ఆలయాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టినట్లు బీజేపీ జిల్లా కార్యదర్శి పుప్పాల రాము తెలిపారు. దీనిలో భాగంగా శనివారం మండల పరిధిలోని గాంధీనగరం గ్రామంలో అభయ ఆంజనేయస్వామివారి దేవాలయాన్ని పార్టీ నాయకులతో కలసి శుభ్రం చేశారు.

బాగా చదివి ఉన్నతస్థానానికి చేరుకోవాలి



వెంకటాపురం జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న సర్పంచ్ సోములమ్మ

వెంకటాపురం(మోపిదేవి): విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని సర్పంచ్ తుమ్మా సోములమ్మ ఆకాంక్షించారు. మండల పరిధిలోని వెంకటాపురం జెడ్పీ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు 11 మందికి శనివారం ట్యాబ్‌లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు. పేరెంట్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ పేరుబోయిన వెంకటేశ్వరావు, వైస్ చైర్మన్ పిట్టు వెంకట కుమారి, ఉపాధ్యాయులు సీహెచ్ నళిని, సింధు, మాజీ సర్పంచ్ అబ్బూరి నాంచారయ్య, గ్రామ పార్టీ కన్వీనర్ పిండి వెంకటేశ్వరావు, గొరిపర్తి శివప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'పెడన' జట్లు ఎంపిక

పెడన : సచివాలయ, మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు శనివారంతో ముగియడంతో నియోజవర్గ స్థాయిలో ఆడనున్న జట్లను ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ వీరమల్లు రెడ్డెయ్య తెలిపారు. ఇందులో భాగంగా క్రికెట్ పురుషులు, మహిళల విభాగంలో దాదాగుంట ఏరియా, గాంధీనగర్ వార్డు సచివాలయాల జట్లు, బ్యాడ్మింటన్ పోటీలో పురుషులు, మహిళల విభాగంలో అగస్తేశ్వరపురం, బంటుమిల్లి రోడ్డు వార్డు సచివాలయాలు, వాలీబాల్ ఆటలో పురుషులు, మహిళల విభాగంలో కాకర్లమూడి, పుల్లపాడు సచివాలయాల జట్లు, కబడ్డీలో పురుషులు, మహిళల విభాగంలో నందమూరు, నందిగామ సచివాలయాల జట్లు, ఖో ఖో పోటీలో పెనమల్లి సచివాలయం, పెడన బ్రహ్మపురం వార్డు సచివాలయం జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయని ఎంపీడీఓ పేర్కొన్నారు. ఈ నెల 24 నుంచి నియోజకవర్గ పోటీలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



అరిశేపల్లిలో అయోధ్య అక్షింతలను పంపిణీ చేస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

కోనేరుసెంటర్: శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీ అయోధ్య శ్రీరాముని పూజిత రక్షిత అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం అరిశేపల్లిలో నిర్వహించారు. వీహెచ్‌పీ ప్రతినిధులు గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అయోధ్య అక్షింతలను పంచారు. అయోధ్యలో జరిగే శ్రీరాముని ప్రతిష్ఠను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ శ్రీరామ నామ జపం, ప్రత్యేక పూజలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ సభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

గుడివాడరూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ పేర్కొన్నారు. గుడివాడ ట్రాఫిక్ ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో గుడివాడ బస్టాండ్ సెంటర్లో శనివారం సాయంత్రం నిర్వహించిన రోడ్డు భద్రత మాసోత్సవం కార్యక్రమంలో డీఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పలువురు వాహనచోదకులకు రోడ్డు భద్రత, నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులతో కలసి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా మద్యం తాగి, సెల్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేరంటాలమ్మ ఆలయంలో భారీ అన్నసంతర్పణ

రామవరప్పాడు: రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా ముగిసిన సందర్భంగా శనివారం భారీ అన్నసంతర్పణను నిర్వహించారు. కార్యక్రమాన్ని గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు ప్రారంభించారు. రూరల్ మండల పరిధిలోని 9 వేల మంది భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పాతూరి లోకేశ్వరి, బోయిన భాను ప్రదీప్‌లు మాట్లాడుతూ రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామస్తులు, గ్రామ పెద్దల సహకారంతో సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించామన్నారు. అన్న సంతర్పణకు రెండు గ్రామాల పెద్దలు పూర్తి సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరించారు. జాతీయ రహదారిని భక్తులు దాటేందుకు వీలుగా సహాయ, సహకారాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

అర్చకులకు సంక్రాంతి కానుకలు

పామర్రు: నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లోని పలు ఆలయాల అర్చకులు, పురోహితులకు పామరుర ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సంక్రాంతి కానుకలను అందజేశారు. నిమ్మకూరు వెంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు యోగానంద లక్ష్మీ నరసింహాచార్యులకు స్థానిక పార్టీ నేతలు నూతన వస్త్రాలను స్వీట్లను శనివారం అందజేశారు. నెమ్మలూరు, ప్రాకర్ల, కొరిమెర్ల, నిభానుపూడి తదితర గ్రామాల్లో అర్చకులకు కానుకలను అందజేశారు.

మృతుడి కుటుంబానికి సాయం అందజేత

పామర్రు: స్థానిక 17వ వార్డులోని చిన్న మసీదు పక్కన మహమ్మద్ సయ్యద్ అనే వైఎస్సార్ సీపీ కార్యకర్త గుండె పోటుతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబానికి జగనన్న ప్రభుత్వం వైఎస్సార్ బీమా రూ.లక్ష మంజూరు చేసింది. స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు మృతుడి కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను తక్షణ సాయం కింద పామర్రు ఏఎంసీ వైస్ చైర్మన్ ఎండీ నయముద్దీన్, ముస్లిం జేఏసీ కన్వీనర్ ఎండీ జమీల్ చేతుల మీదుగా మృతుడి కుటుంబసభ్యులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, మండల కో–ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ హుస్సేన్, కాలిక్, వైఎస్సార్ సీపీ నాయకుడు కొచ్చెర్ల శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ హుస్సేన్ పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకే..

వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఇన్‌చార్జి పేర్ని కిట్టు



క్రీడాకారులతో పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ



విజేతలకు ఉప్పాల రాముతో కలిసి బహుమతులు ఇస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హారిక

మచిలీపట్నంటౌన్: క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా నిర్వహిస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా స్థానిక నోబుల్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఆటల పోటీలను శనివారం మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి పేర్ని కిట్టు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. దీనిలో భాగంగానే క్షేత్రస్థాయి నుంచి క్రీడాకారులను గుర్తించడానికి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విడతల వారీగా రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. మచిలీపట్నంలో క్రీడాకారులు అన్ని ఆటల్లో ప్రతిభ కనబరిచి జిల్లా టీమ్‌లో ఎంపిక కావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మేయర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ క్రీడాకారులు వారి ప్రతిభను పూర్తిస్థాయిలో బహిర్గతపరిచి మంచిస్థానాలను సాధించాలన్నారు. ఈ సందర్భంగా క్రికెట్ ఎనిమిది మ్యాచ్‌లు, వాలీబాల్ రెండు మ్యాచ్‌లు, కబడ్డీ రెండు మ్యాచ్‌లు, మహిళల ఖోఖో మ్యాచ్ నిర్వహించారు. పోటీలను కార్పొరేటర్ తిరుమలశెట్టి ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకుడు మన్నే శేషారావు, పాండురంగ ఉన్నత పాఠశాల పీఈటీ రమేష్‌కుమార్ పర్యవేక్షించారు.

- **కృత్తివెన్ను:** ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో భాగంగా మండలస్థాయిలో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో మాట్లాం, ఇంతేరు జట్లు ఫైనల్స్‌కు చేరుకోగా మాట్లాం జట్టు విజేతగా నిలిచింది. కార్యక్రమంలో కృత్తివెన్ను ఎంపీపీ గరుడప్రసాద్, ఎంపీడీవో పిచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.
- **చల్లపల్లి:** ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రికెట్ పోటీల్లో మండల విజేతగా చల్లపల్లి గ్రామ సచివాలయం–3 జట్టు నిలిచింది. శనివారం స్థానిక ఎస్ఆర్ వైఎస్‌పీ హైస్కూల్లో మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర క్రికెట్ ఫైనల్ పోటీ నిర్వహించారు. లక్ష్మీపురం గ్రామ సచివాలయం–1 జట్టుతో జరిగిన పోటీలో చల్లపల్లి గ్రామ సచివాలయం–3 జట్టు విజేతగా నిలిచి, నియోజకవర్గ పోటీలకు అర్హత సాధించింది. విజేతలను ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు అభినందించారు.
- **గూడూరు:** ఆడుదాం ఆంధ్రాలో భాగంగా గూడూరులో శనివారం మండల స్థాయి పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, సర్పంచి లింగం సులోచనారాణి, ఏపీఎస్‌ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, గొరిపర్తి రవికుమార్, ఎంపీడీఓ డి.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.
- **బంటుమిల్లి:** నాలుగు రోజులుగా మండల స్థాయిలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు శనివారంతో ముగిశాయని ఎంపీడీఓ జె.స్వర్ణభారతి తెలిపారు. ఈ పోటీల్లో మండలంలోని 16 సచివాలయాల నుంచి పురుషులు, మహిళల జట్లు 30 పాల్గొన్నట్లు ఆమె తెలిపారు. వీరిలో పురుషుల విభాగంలో బంటుమిల్లి–2 సచివాలయం, మహిళల విభాగంలో పెదతుమ్మిడి సచివాలయం జట్టు ఫైనల్‌కు చేరుకున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ నెల 24 నుంచి పెడనలో నియోజకవర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ఐదు కేటగిరీల్లో జరుగుతాయని స్వర్ణభారతి చెప్పారు.

ముమ్మరంగా కులగణన



నాగాయలంక మండలం నంగేగడ్డ సచివాలయ పరిధిలో జరుగుతున్న కులగణన

నాగాయలంక: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన నాగాయలంక మండలంలో ముమ్మరంగా కొనసాగుతోంది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి చతుర్వేదుల శ్రీనివాస్ పర్యవేక్షణలో శనివారం మండలంలోని 16 సచివాలయాల పరిధిలో కులగణన జరిగింది. మండలంలో జనాభా 46,920మంది ఉండగా, గృహాల సంఖ్య 17,055ఉందన్నారు. కులగణనకు 298మంది ఎన్యుమరేటర్లను నియమించామని, సచివాలయ ఉద్యోగులు 136మంది, వెరిఫికేషన్ అధికారులు ఐదుగురు, మండల స్థాయి పర్యవేక్షకులు ఆరుగురు కులగణన నిర్వహణలో పని చేస్తున్నారని, ఎలాంటి ఆటంకాలు లేవని ఎంపీడీఓ తెలిపారు. మండల ఈఓపీఆర్‌డీఓ కె.అప్పల నరసమ్మ, మల్లికార్జునరావు తదితర గ్రేడ్–1 కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను దళితులు గుర్తుంచుకుంటారు

- వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుర్రం బసవయ్య
- దళితద్రోహి చంద్రబాబు

అవనిగడ్డ: దేశం మొత్తం గర్వపడేలా విజయవాడలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఏర్పాటు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి యావత్ దళితులు తలెత్తుకునేలా చేశారని, జీవితాంతం గుర్తుంచుకుంటారని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుర్రం బసవయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని టీడీపీ నేతలు దళిత ద్రోహి అని విమర్శించడం సిగ్గుచేటన్నారు. దళితుల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారని పేర్కొన్న చంద్రబాబు, దళితులకు రాజకీయాలు ఎందుకని హేళనగా మాట్లాడిన చింతమనేని ప్రభాకర్ దళితద్రోహులు అని బసవయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కొన్నామని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు ఆ స్థలం ఎక్కడుందో మీ పార్టీ నాయకులకైనా చూపించాలని బసవయ్య అన్నారు. ఇంతవరకూ ఎస్సీలకు కేటాయించని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని తొలిసారిగా దళితుడైన తనకు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. అవనిగడ్డ సర్పంచ్ గొరుముచ్చు ఉమా మాట్లాడుతూ స్టాట్యూ ఆఫ్ లిబర్టీ అమెరికాకు ఎంత గుర్తింపు తీసుకొచ్చిందో మన దేశానికి విజయవాడలో ఏర్పాటు చేసిన స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ అంతే గుర్తింపు తీసుకురానుందని చెప్పారు. సీఎంకు వస్తున్న పేరు ప్రతిష్ఠలు తట్టుకోలేని ప్రతిపక్ష నాయకులు చౌకబారు విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయకుమార్, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, ఎస్సీ సెల్ నాయకులు వెన్నా ప్రసాద్ పాల్గొన్నారు.